క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో జమ్ములమ్మ



గద్వాల: శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జమ్ములమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



అయిజ: మున్సిపాలిటీలో 13, 14 వార్డుల్లోని వివిధ కాలనీల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

వీధికుక్కల స్వైర విహారం



అయిజ: పట్టణంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డు వెంట వెళ్లే వారిపై దాడి చేస్తుండటంతో ఆస్పత్రులు పాలవుతున్నట్లు పట్టణ ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా వాహనాలకు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనాల దారులు అదుపుతప్పి కిందపడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధికుక్కల బారి నుంచి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మల్దకల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు. పెంచికలపాడు గ్రామానికి చెందిన తిమ్మప్ప తాటికుంట రిజర్వాయర్ నుంచి కొద్ది రోజులుగా ఇసుకను మద్దెలబండ మీదుగా మల్దకల్‌కు తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు శుక్రవారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గద్వాల: మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన ఉండాలని వాటి నుంచి రక్షణ పొందాలని సఖీ వన్‌స్టాప్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా పోలీసు సాయం, వైద్యం, న్యాయ, తాత్కాలిక ఆశ్రయం వంటి వాటిపై వివరించారు. సమస్యలు ఎదురైతే వెంటనే 181 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుత్ కోతలను అరికట్టండి

రాజోళి: వడ్డేపల్లి మున్సిపాలిటీలో నిత్యం విద్యుత్ కోతలతో సతమతమవుతున్నట్లు పట్టణ వాసులు వాపోతున్నారు. ఉదయం నుంచే కోతలు మొదలవుతున్నాయని, గంటల వ్యవధిలో కోతలు విధిస్తున్నారని పేర్కొంటున్నారు. విద్యుత్ కోతలు ఏ సమయంలో ఉంటాయో స్పష్టత ఉండదంటున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు తీస్తుండటంతో ఎల్రక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు తీర్చాలని మున్సిపల్ వాసులు కోరుతున్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు తల్లిపాలపై ఆవశ్యకతపై అవగాహన కల్పించడం, అన్నప్రసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ చెట్ల కింద చదువులు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలు

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు లేక చెట్లకింద విద్యాభ్యాసం కొనసాగించాల్సిన పరిస్థితి దాపురించింది. ఇంకెన్నాళ్లు దేవుడా చెట్లకింద మా చదువులు అంటూ ఆయా పాఠశాలల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్దకల్, ధరూరు, గట్టు, గద్వాల, కేటీదొడ్డి మండలాల్లోని జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ప్రతినిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సగానికి పైగా పాఠశాలలకు గదుల కొరత ఉండటంతో చెట్ల కింద, వరండాలు, తాత్కాలిక రేకుల షెడ్లలలో విద్యార్థులు కాలం వెల్లదీయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.



బిజ్వారంలో రేకుల షెడ్డు కింద పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు



మల్దకల్‌లో చెట్ల కింద పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

చదువుకు దూరమవుతున్నారు

మల్దకల్ మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఉన్నత, 27 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 5,948 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో సరిపడా తరగతి గదులు, మౌలిక వసతులు లేక చదువు ఆపేసి పొలం బాట పడుతున్నారు. ప్రభుత్వం విద్యను ప్రోత్సహించేందుకు ఓ పక్క చర్యలు తీసుకుంటున్నా.. మరో పక్క పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది గ్రామీణ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నవి కూడా శిథిలావస్థలోనే

మల్దకల్ హైస్కూల్‌లో 666 మంది విద్యార్థులకు గాను 12 తరగది గదులున్నాయి. ఉన్న గదులు పై పెచ్చులూడి ప్రమాదభరితంగా మారాయి. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. అలాగే పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. ప్రహరీలు లేకపోవడంతో ఆవరణ అపరిశుభ్రంగా మారుతుంది. బిజ్వారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 398 మంది విద్యార్థులకు గాను 10 తరగది గదులున్నాయి. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులను చెట్లకింద కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలన్నా విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది అదనపు గదులు ఏర్పాటు చేస్తారని ఆశించటమే తప్పా ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



సరిపడా గదులు, వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేని కారణంగా విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. గదులు లేక రోజు చెట్ల కింద చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– నందకిశోర్, 6వ తరగతి, మల్దకల్

బడికి వెళ్లాలంటే భయం



బడికి వెళ్లాలంటే భయంగా ఉంది. పాఠశాలల్లో సరిపడా గదులు లేక చెట్ల కింద చదువకుంటున్నాం. ఉన్న తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నాం.

–సోని, 9వ తరగతి, బిజ్వారం

ఉన్నతాధికారులకు నివేదించాం



మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో నెలకొన్న గదులు కొరత, మౌలిక సదుపాయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్న గదుల్లోనే సమస్య లేకుండా విద్యాభ్యాసం చేయిస్తున్నాం. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సురేష్, ఇన్‌చార్జ్ ఎంఈఓ మల్దకల్

మెరుగైన విద్యా బోధన చేయాలి

మల్దకల్: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేసి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ అబ్దుల్ ఘని ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మల్దకల్ జెడ్పీహెచ్ఎస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలకు గైర్హాజరయిన విద్యార్థులపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల తరగతి గదులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్దకల్ హైస్కూల్‌లో ఏఐను పరిశీలిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: టీబీ వ్యాధిగ్రస్తులు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు రాజు, స్వరూపరాణి, టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదిక్ సూచించారు. శుక్రవారం మండలంలోని విఠలాపురం గ్రామంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడటంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. మందుల వాడకంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు మందులు వాడాలన్నారు. అనంతరం గ్రామస్తులకు టీబీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత, ఎంహెచ్‌పీ సౌజన్యరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీధర్, దేవన్న, జయరాములు, హెల్త్ అసిస్టెంట్ ఏఎన్ఎం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విఠలాపురంలో టీబీ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బురద రోడ్డుపై ప్రయాణమెలా ?



షేకుపల్లి వద్ద గుంతలు ఏర్పడి పూర్తిగా ధ్వంసమైన రోడ్డు

ఎర్రవల్లి: మండల కేంద్రం నుంచి రాజశ్రీ గార్లపాడు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు బురదమయంగా మారి నానా అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. షేకుపల్లి, సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల గ్రామాల సమీపంలో గుంతలు అధికంగా ఉండటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా షేకుపల్లి పెద్దవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పనులను మధ్యలో నిలిపివేయడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు పూర్తిగా ధ్వంసమైనట్లు పేర్కొంటున్నారు. అలాగే సాసనూలు సమీపంలోని రెండు వాగులకు ఇరువైపులా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రాత్రుళ్లు రోడ్డుపై గుంతలు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా కుంకుమార్చన పూజలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రయంలో అర్చకులు నర్సింహస్వామి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

గద్వాల: ఇటిక్యాల సాంఘీక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల చేత బాత్రూంలు, బండలు కడిగిస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్ బీఎం సంతోష్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రతిరోజు ప్రిన్సిపాల్ విద్యార్థులతో పనులు చేయిస్తూ వేధింపులకు పాల్పడుతున్నట్లు దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో విద్యార్థి సంఘం నాయకులు కురువ పల్లయ్య, హలీంపాషా, దానయ్య తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీలో మొక్కల పంపిణీ



రాజోళి: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ సిబ్బంది మొక్కలను పంపిణీ చేశారు. వన మహోత్సవం 2025లో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ కమిషనర్ రాజయ్య ఆధ్వర్యంలో పూలు, పండ్ల మొక్కలను అందజేశారు. వడ్డేపల్లి, రామచంద్రనగర్ వార్డుల్లో మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికి అందించిన మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు వెంటనే పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసే వరకు పనులు చేసి ఓట్లు దండుకున్నారని, మల్లమ్మకుంట, ఇతర రిజర్వాయర్ల పనులు పెండింగ్‌లో ఉంచారన్నారు. అధికారంలోకి వస్తే వాటిని మేమే పూర్తి చేస్తామని చెప్పిన రేవంత్ సర్కార్ కూడా దానిపై స్పందించకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నీరు వృథాగా దిగువకు వెళ్తుందని, దాన్ని వదిలేసి నీటి దోపిడి అంటూ ఆరోపణలతో రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. వీలైనంత త్వరగా తుమ్మిళ్ల లిఫ్టులో బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఆత్మకూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన శిక్షలు తప్పవని ఎస్సై నరేందర్, ఏవో వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం పట్టణంలో విత్తన, ఫర్టిలైజర్స్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. పలు షాపుల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఏఈవోలు మహేష్, ఝాన్సీ, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

మల్దకల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి హృదయరాజు సూచించారు. శుక్రవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన దేవసేనారెడ్డి దంపతులను శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. దేవసేనారెడ్డి సేవలు విద్యార్థులు ఎప్పటికీ మరువలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు నర్సింహులు, రామాంజనేయులుగౌడ్, గోవర్ధన్ శెట్టి, భాగ్యలక్ష్మి, రాఘవేందర్, మాధురి, నీలవేణి, శ్రీకాంత్, బాలకృష్ణ, సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటర్మీడియేట్ అధికారి హృదయరాజు

మెరుగైన వైద్య సేవలందించాలి

గద్వాల క్రైం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి సిద్దప్ప అన్నారు. జిల్లా కేంద్రంలోని జమ్మిచేడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో రోగులకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అవసరమైయ్యే మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ఆహార అలవాట్లు, శుభ్రత, వ్యాధుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యాక్రమంలో కృష్ణవేణి, రవిచందర్, శ్యాంసుందర్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సిద్ధప్ప

వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

ఇటిక్యాల: పశువులు, గొర్రెలల్లో వచ్చే నీలి నాలుక (మూతి వాపు) వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శివనంపల్లి గ్రామంలో గొర్రెలకు టీకాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 500 గొర్రెలకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. అనంతరం వైద్యుడు మాట్లాడుతూ.. నీలి నాలుక వ్యాధి క్యూలికాయిడ్స్ అనే దోమకాటు ద్వారా గొర్రెలకు సంక్రమిస్తుందన్నారు. వర్షాకాలంలో దోమల తీవ్రత అధికంగా ఉండటం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వ్యాధి సోకిన జీవాల్లో జర్వం తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. నాలుక వాచి నీలిరంగులోకి మారి శ్వాస తీసుకోవడంలో కష్టతరంగా ఉంటూ ముక్కు నుంచి జిగురు లాంటి ద్రవం కారుతుందన్నారు. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేసి, గొర్రెల పాకలో దోమలు రాకుండా దోమతెర, పొగపెట్టడం వంటివి చేయాలని గొర్రెల యజమానులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సబీనా, జీవాల పెంపకదారులు తదితరులు పాల్గొన్నారు.



శివనంపల్లిలో టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పరిశుభ్రత పాటిద్దాం.. వ్యాధులు అరికడదాం

అయిజ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులను అరికడుదామని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురంలో ఏఎన్ఎంలు కవిత, తిప్పమ్మ ఆశా వర్కర్లతో కలిసి నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. మురుగు నిల్వ ఉండకుండా ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, బురద ప్రదేశాల్లో బ్లీచింగ్ చేయించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏఎన్ఎంలకు సూచనలిస్తున్న ప్రోగ్రాం అధికారి రాజు

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇరువురికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని అంతరాష్ట్ర రహదారిపై బొంకూరు శివారులో కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇరువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం, యాదగిరి జిల్లా షాపూర్ గ్రామానికి చెందిన సూర్యనారాయణరావు కుటుంబ సభ్యులతో కలిసి కారులో తిరుపతికి వెళ్తుండగా, బొంకురు శివారులో గ్రామానికి చెందిన రామేశ్వరమ్మ, చిన్న వెంకటన్న బైక్‌పై పొలానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం బైక్‌ను కారు ఢీకొట్టగా బైక్‌పై ఉన్న వారు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న స్థానికులు

ఇళ్ల మంజూరులో ప్రభుత్వం విఫలం

అమరచింత: నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ నాయకులు ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం 8, 10 వార్డుల్లో ఇళ్లు మంజూరు కాని వారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8వ వార్డులో నూర్జహాన్ బేగం, మల్లైకాబేగం, షాహీన్ ఇళ్లు కూలిపోయాయి. అలాగే 4వ వార్డులో సామెలు గుడిసెను తొలగించుకున్నాడని తెలిపారు. గురువారం ఇళ్ల పొస్రిడింగ్‌లను పంపిణీ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి లబ్ధిదారులకే మంజూరు చేశామని ప్రకటించడం ఎంతవరకు సమంజసమన్నారు. అర్హులకు మంజూరు చేయకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవీందర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, భాస్కర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.



ఇళ్లు మంజూరు కాని వారితో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పెచ్చులతో పొంచి ఉన్న ప్రమాదం



వైద్యశాలలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది



పెచ్చులూడుతున్న ఇటిక్యాల పశువైద్యశాల భవనం పైకప్పు

ఇటిక్యాల: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో భవనం పైకప్పు పెచ్చులూడుతూ ప్రమాదకర పరిస్థితి నెలకొంది. పదేళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల చిన్నపాటి వర్షానికి సైతం వర్షపునీరు లీకేజవుతుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు సైతం నిత్యం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుపుతున్నారు. మూగజీవాలకు అవసరమయ్యే మందులు, టీకాలు వర్షపు నీటిలో తడిసిపోయిన సందర్భాలు ఉన్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు. దీనిపై పశువైద్యాధికారి వినయ్‌ను సాక్షి వివరణ కోరగా.. ఇటీవలే మరమ్మతులను చేపట్టేందుకు ప్రభుత్వానికి అంచనా వేసి నివేదికను అందజేసినట్లు పేర్కొన్నారు.